www.netifocusnews.com

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

శుక్రవారం 10, అక్టోబర్ 2025 | వెల: రూ.4/- | సంపుటి: 01 | సంచిక: 40 | పేజీలు: 04

Published From: Hyderabad

Editor: Mankali Tharun

## ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందం..

- ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని ట్రంప్ వెల్లడి
- ట్రంప్ చొరవను స్వాగతించిన ప్రధాని మోడీ

3



2

### సుప్రీం తీర్పు మేరకు బీసీ బిల్లు ఆమోదించినట్లే!

- రాష్ట్రపతి ఆమోదం పొందిన చట్టం అయినట్లే
- అందుకే బీసీలకు రిజర్వేషన్లపై జీవో ఇచ్చాం
- 42% రిజర్వేషన్లను అడ్డుకున్నదే బీజేపీ, బీఆర్ఎస్
- ఉప ముఖ్యమంత్రి భట్టి



2

### 5,586 కి.మీ రోడ్ల అభివృద్ధి

- తొలి దశలో 10,986 కోట్లతో పనులు
- హ్యామ్‌లో చేపట్టనున్న ఆర్అండ్‌బీ: కోమటిరెడ్డి
- ట్రాఫిక్ సర్వే ప్రకారమే హ్యామ్ రోడ్లు: భట్టి

# స్థానిక ఎన్నికలకు బ్రేక్

## బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే..

- 50% మించరాదన్న వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం
- నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ
- సర్కారుకు నోటీసులు.. కౌంటర్‌కు 4 వారాల గడువు
- పిటిషనర్ల సమాధానానికి మరో 2 వారాలు
- ఆరు వారాల పాటు విచారణ వాయిదా
- బీసీల ఇంప్లీడ్ పిటిషన్లు విచారణకు స్వీకరణ
- రాష్ట్రపతి వద్ద 3 నెలలుగా 42% రిజర్వేషన్ల బిల్లులు
- ఇటీవలి సుప్రీం తీర్పు నేపథ్యంలో అవి చట్టాలైనట్లే..
- నోటిఫికేషన్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోలేవు
- ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదీర్ఘ వాదన

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–అక్టోబర్ 9:

ఉత్కంఠ భరితంగా మారిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను హైకోర్టు నిలిపేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై స్టే విధిస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జీవోపై స్టే ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. మొత్తం రిజర్వేషన్లు 50% దాటరాదని సుప్రీంకోర్టు విధించిన పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించిందన్న పిటిషనర్ల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. దీనిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి నాలుగు వారాలు, ప్రభుత్వ కౌంటర్‌కు ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్లకు 2 వారాల సమయం ఇచ్చింది. విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బీసీ నాయకులు, బీసీ సంఘాలు దాఖలు చేసిన దాదాపు 60 ఇంప్లీడ్ పిటిషన్‌లను విచారణకు స్వీకరిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ బుట్టెంగారి మాధవరెడ్డి, తదితరులు హైకోర్టులో దాదాపు 10 పిటిషన్‌లు దాఖలు చేశారు. బుధవారం వాదనలు ముగియక పోవడంతో గురువారం మధ్యాహ్నం 2.15 గంటల నుంచి చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చాలా కసరత్తు చేసిందని తెలిపారు. "స్వతంత్రం వచ్చిన నాటి నుంచి రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, కుల సర్వే చేపట్టాం. సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ అమలులో భాగంగా బీసీల రాజకీయ, సామాజిక వెనుకబాటును అంచనా వేయడం కోసం

మిగతా 2లో..






# సర్కార్ నడవట్లేదు.. సర్కస్ నడుపుతున్నారు

- బస్‌ఛార్జీల పెంపుతో కుటుంబాలపై భారం
- మహిళలకు ఉచిత బస్సు.. మగాళ్లపై ఛార్జీల భారం
- బస్ భవన్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కెటిఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–అక్టోబర్ 9:

రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని మిగతా 2లో..



# న్యూయార్క్, టోక్యో, సియోల్‌తో హైదరాబాద్ పోటీ

- ఫార్చ్యూన్ 500 కంపెనీలన్నీ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలి
- పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదు: సీఎం
- హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులతో భేటీ


హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–అక్టోబర్ 9:

పాలకులు మారినప్పుడల్లా ప్రభుత్వ విధానాలు కూడా మార్చుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను తమ ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తోందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధులతో గురువారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో, భారత్ అమెరికా మిగతా 2లో..



# మన బంధం.. సుస్థిర స్తంభం

- భారత్ యూకే భాగస్వామ్యం ప్రపంచ సుస్థిరతకు మూల స్తంభం
- ఇరుదేశాల మధ్య బంధం నమ్మకమైనది.. ప్రతిభ, సాంకేతికతతో ముందుకెళ్తోంది
- బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చల అనంతర ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం గొప్ప ముందడుగు: బ్రిటన్ ప్రధాని స్టార్మర్



2

2 నేటి ఫోకస్ న్యూస్ అనునిత్యం- ప్రజాపక్షం
ప్రాంతీయం
www.netifocusnews.com
శుక్రవారం 10, అక్టోబర్ 2025
netifocusnewsdaily

# స్థానిక ఎన్నికలకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

ఇంటింటి కుల సర్వే చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భారీగా 57.6 శాతం వెనుకబడిన వర్గాలు ఉన్నట్లు సర్వేలో తేలిసింది. సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వ అవసరం కోసం కాబట్టి దానిని ఎవరికీ చూపాల్సిన అవసరం లేదు. సర్వే నివేదికలోని ఎంపరికల్ డేటా ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే విద్య- ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు బీసీ బిల్లులను అసెంబ్లీలో పెట్టింది. బిల్లులు ఎలాంటి వ్యతిరేకత లేకుండా ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. గవర్నర్ వాటిని రాష్ట్రపతికి పంపారు. పంచాయతీరాజ్ చట్టం-2018లోని 285(ఏ)లో ఉన్న రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న గరిష్ఠ పరిమితిని ఎత్తేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. పరిణామక్రమంలో ఆర్డినెన్స్‌ను చట్టరూపంలోకి మార్చేందుకు దాన్ని అసెంబ్లీలో పెట్టారు. ఎలాంటి వ్యతిరేకత లేకుండా ఉభయ సభల ఆమోదం పొందింది. మరో కేసులో రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లులను గవర్నర్, రాష్ట్రపతి మూడు నెలల్లో ఆమోదించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దాని ప్రకారం చూస్తే రాష్ట్రపతి దగ్గర పెండింగులో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందినట్లే. అవి చట్టాలుగా అమల్లోకి కూడా వచ్చినట్లే భావించాలి. వాటిని మళ్లీ ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదు. అలాగే పంచాయతీరాజ్ సవరణ చట్టం సైతం ఆమోదం కోసం గవర్నర్ దగ్గరకు వెళ్లింది. దానిని గవర్నర్ రాష్ట్రపతికి పంపారు. ఆ సవరణకు మూడు నెలలు నిండకపోయినా అంతకు ముందు 285(ఏ)ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ఇప్పటికీ అమలులో ఉంది. ఆర్డినెన్స్ జారీ చేస్తే అది ఆరు నెలల పాటు అమలులో ఉంటుంది. ఇప్పటికీ ఆర్డినెన్స్ అమలులో ఉంది కాబట్టి 285(ఏ)లో 50 శాతం గరిష్ఠ పరిమితి అమలులో లేదు.

అందుకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేశాం. 2019లో (బీఆర్ఎస్ హయాంలో) పంచాయతీరాజ్ చట్టంలో 285 (ఏ)లో 50 శాతం గరిష్ఠ పరిమితి విధిస్తూ చట్టసవరణ చేసినప్పుడు గవర్నర్ వెంటనే ఆమోదించారు. అదే సెక్షన్‌కు ఇప్పుడు సవరణ చేస్తే మాత్రం గవర్నర్ ఆమోదం తెలపకుండా రాష్ట్రపతికి పంపారు. 50 శాతం గరిష్ఠ పరిమితిని చట్టంలో చేర్చడం ఒక వ్యతిరేక చర్య. ఎవరైనా రిజర్వేషన్ అంత ఇస్తాం, ఇంత ఇస్తాం అని చెప్తారే కానీ ఇంతకు మించి ఇవ్వం అని చట్టంలో చేరుస్తారా? అదొక నెగిటివ్ ప్రొవిజన్. ఈ మొత్తం పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లు చట్టాలుగా మారి అమలులో ఉండటంతో పాటు ఆర్డినెన్స్ ద్వారా పంచాయతీరాజ్ సవరణ చట్టం అమలులో ఉంది. స్థానిక సంస్థలు రాష్ట్ర జాబితాలోని అంశం. దానిపై చట్టాన్ని రాష్ట్రపతికి పంపాల్సిన అవసరం ఏముంది? బీసీలకు 2025 లెక్కల ప్రకారం, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇస్తారా ? అని పిటిషనర్లు అడుగుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా లెక్కల ప్రకారమే రిజర్వేషన్ ఇవ్వాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. ఇప్పటికీ 2011 జనాభా లెక్కలే అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. బీసీల కులాల లెక్కలు ఎప్పుడూ తీయలేదు. ఇదే తొలిసారి కాబట్టి ప్రస్తుత సర్వే ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. దీనిని వ్యతిరేకించడం సరికాదు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీ బిల్లులను, రిజర్వేషన్లను వ్యతిరేకించలేదు. ఇది రాష్ట్ర ప్రజల అభీష్టం. దానిని అడ్డుకోలేం. బిల్లుల ఆమోదం ముఖ్యం కాదు. రాష్ట్ర శాసన వ్యవస్థకు శాసన అధికారం(లిజిస్లేటివ్ కాంపిటెన్స్) ఉందా? లేదా? అనేది ముఖ్యం. ప్రస్తుత చట్టాలు చేయడానికి వంద శాతం రాష్ట్ర అసెంబ్లీకి శాసనాధికారం ఉంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై జోక్యం చేసుకోరాదు. అలాగే రాజ్యాంగంలోని 243(ఓ)లో నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల విషయంలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని, ఏ వివాదం ఉన్నా ఎన్నికల పిటిషన్‌ల రూపంలో తేల్చుకోవాలని స్పష్టమైన నిర్దేశం ఉంది. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదని స్పష్టమైన తీర్పులు ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే పిటిషన్లు దాఖలైనా సరే జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. ఇంద్రసహానీ తీర్పులో పెట్టిన 50 శాతం పరిమితి రాజకీయ రిజర్వేషన్లకు వర్తించదు' అని అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచే మరో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రవివర్మ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని రాజ్యాంగంలో ఎక్కడా లేదని గుర్తు చేశారు. ఇది కేవలం సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్ మాత్రమేనన్నారు. కే కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ పరిమితికి రాజ్యాంగబద్ధత లేదని చెప్పారు. 15 శాతం కూడా లేని ఇతర కులాలకు 33 శాతం ఓపెన్ క్యాటగిరీ ఉన్నప్పుడు పిటిషనర్లకు అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

## సుప్రీం తీర్పు మేరకు బీసీ బిల్లును ఆమోదించినట్లే!

- రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టం అయినట్లే
- అందుకే బీసీలకు రిజర్వేషన్లపై జీవో ఇచ్చాం
- 42% రిజర్వేషన్లను అడ్డుకున్నదే బీజేపీ, బీఆర్ఎస్
- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క
- ఉత్తర్వులు పరిశీలించాక కార్యాచరణ: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-అక్టోబర్ 9:

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేశామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. "స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ మార్చి 17, 2025న ఏకగ్రీవంగా ఆమోదించి పంపిన బిల్లు రాష్ట్రపతి వద్ద ఇంకా పెండింగ్‌లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపితే మూడు నెలల్లోపు దాన్ని ఆమోదించాలి. లేదా తిప్పి పంపాలి. అలా తిప్పి పంపకుంటే ఆ బిల్లు ఆమోదం పొందినట్లేనని తమిళనాడు వర్సెస్ గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు ఏప్రిల్ 8, 2025న పేర్కొంది. ఆ ఆదేశాల మేరకు.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది, చట్టం అయినట్లే. ఆ చట్టం ప్రకారమే స్థానిక ఎన్నిలకు రిజర్వేషన్లపై జీవో జారీ చేశాం" అని భట్టి పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే శాస్త్రీయంగా ప్రక్రియను నిర్వహించి, జీవో జారీ వరకూ వచ్చామని తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నదే బీజేపీ, బీఆర్ఎసలని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టం చేసిందని, ఆ చట్టమే బీసీల రిజర్వేషన్లకు ఉరితాడైందని చెప్పారు. అలాగే బీసీ బిల్లులను పెండింగ్‌లో పెట్టింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మడానికి బీసీలు అమాయకులేమీ కాదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఓబీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించడానికి ప్రభుత్వం వద్ద సమగ్ర సమాచారం ఉండాలని తెలిపారు. 2019లో పంచాయతీరాజ్ ఎన్నికల తర్వాత తగినంత సమయం ఉన్నా.. సమగ్ర సమాచారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కులగణన సర్వే ఎందుకు చేయలేదని నిలదీశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్రంలో ఓబీసీలు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేల్చడానికే తాము కులగణన సర్వే చేశామన్నారు. సర్వే సమాచారాన్ని శాసనసభలో పెట్టి.. దాని ఆధారంగా బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రూపొందించిన బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారని గుర్తుచేశారు. ఆ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి వద్దకు పంపితే పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బీసీలు క్షమించరని చెప్పారు. కాగా, హైకోర్టు స్టే ఉత్తర్వులను అధ్యయనం చేసిన తర్వాత, సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చెప్పారు.

### నేడు మంత్రులతో సీఎం రేవంత్ భేటీ?

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు. ఈ కేసులో తుది తీర్పు వచ్చే వరకూ ఎదురు చూడాలా? లేక స్టేను ఎత్తివేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలా? అన్నదానిపై న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నారు. హైకోర్టు స్టే ఉత్తర్వులను పూర్తిగా అధ్యయనం చేసి, తదుపరి చర్యలకు ఉన్న అవకాశాలను వివరించాల్సిందిగా నిపుణులను కోరినట్లు తెలిసింది. వారి సూచనల ఆధారంగా తదుపరి కార్యాచరణ నిర్ణయించడానికి శుక్రవారం సీఎం రేవంత్ మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## మన బంధం.. సుస్థిర స్తంభం

- భారత్ యూకే భాగస్వామ్యం ప్రపంచ సుస్థిరతకు మూల స్తంభం
- ఇరుదేశాల మధ్య బంధం నమ్మకమైనది.. ప్రతిభ, సాంకేతికతతో ముందుకెళ్తోంది
- బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చల అనంతర ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం గొప్ప ముందడుగు: బ్రిటన్ ప్రధాని స్టార్మర్

ముంబై, (నేటి ఫోకస్‌న్యూస్)-అక్టోబర్ 9:

భారత్, యూకేలు సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇరు దేశాల మధ్య బంధాలు మరింత వృద్ధి చెంది.. ప్రపంచ సుస్థిరతకు, ఆర్థికాభివృద్ధికి మూల స్తంభంగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో గురువారం మోదీ భేటీ అయ్యారు. నేతలిద్దరూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. అనేక రంగాల్లో ఇరుదేశాల మధ్య బంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం స్టార్మర్, మోదీ మీడియాకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భారత్, యూకేల భాగస్వామ్యం అత్యంత నమ్మకమైంద ని.. ఇది ప్రతిభ, సాంకేతికతతో ముందుకు వెళ్తోందని మోదీ చెప్పారు. ఇరు దేశాల ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, తాను కలిసి పనిచేస్తామన్నారు. భారత్, యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాన్ని స్టార్మర్ గొప్ప ముందడుగుగా అభివర్ణించారు. ఈ ఒప్పందంతో సుంకాలు భారీగా తగ్గిపోతాయన్నారు. ఇరుదేశాల మార్కెట్లలో పరస్పర వాణిజ్యం పెరుగుతుందని, పెద్దఎత్తున ఉద్యోగావకాశాలూ లభిస్తాయని చెప్పారు. 2028 కల్లా ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ప్రధాని మోదీకి, ఆయన నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన అంశంపైనా తాము చర్చించినట్లు చెప్పారు. వివిధ రకాల లక్ష్యాలను ఛేదించగల తేలికపాటి క్షిపణి వ్యవస్థలను భారత సైన్యానికి సరఫరా చేయనున్నట్లు బ్రిటన్ అధికారులు చెప్పారు. అలాగే భారత నౌకాదళానికి అవసరమైన ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశాలపై ఇరుదేశాల మధ్య రూ.4151 కోట్ల ఒప్పందం జరిగినట్లు తెలిపారు.భారత్‌లో కొత్తగా తొమ్మిది బ్రిటన్ యూనివర్సిటీల క్యాంప్‌సలను ఏర్పాటు చేయనున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. ఇటీవలే గురుగ్రామ్‌లో యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ క్యాంప్‌సను ప్రారంభించగా.. ఇప్పుడు యూనివర్సిటీ ఆఫ్ లాంకెస్టర్, యూనివర్సి టీ ఆఫ్ సర్రే క్యాంప్‌సలు కూడా ప్రారంభించనున్న ట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలో యూనివర్సిటీ ఆఫ్ యార్క్, అబెర్డీన్, బ్రిస్టల్, లివర్‌పూర్, క్వీన్స్ యూనివర్సిటీ బెల్‌ఫాస్ట్, యూనివర్సిటీ ఆఫ్ కొవెంట్రీలు క్యాంప్‌సలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో భారత్‌లో అత్యధిక ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పిన దేశంగా బ్రిటన్ నిలవనుందన్నారు.

## న్యూయార్క్, టోక్యో, సియోల్‌తో హైదరాబాద్ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలను స్వీకరిస్తోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అమెరికా తీసుకునే నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో, ఇండో-యూఎస్ సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. హెచ్1-బీ వీసాలపై అమెరికా విధించిన కఠిన నిబంధనలపైన, సుంకాల పెంపుపైన సీఎం ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చే యడంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. అలాగే.. చైనాం1 (చైనాతోపాటు మరో దేశంలో ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించే) వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందని రేవంత్ పేర్కొన్నారు. దానికోసం భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం రూపొందిస్తోందన్న ఆయన.. ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచ నగరంగా ఇప్పటికే హైదరాబాద్ అందరినీ ఆకర్షిస్తోందన్నారు. అందుకే దేశ, విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, సియోల్‌తో పోటీ పడుతోందన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని.. అందులో భాగంగానే హైదరాబాద్‌లో గేమ్-చేంజర్‌గా నిలిచే ప్రాజెక్టులను చేపడుతున్నామని వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్ రైల్, డ్రై పోర్ట్, మాన్యుఫాక్చర్ జోన్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్‌సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నామన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని.. మొత్తం 500 కంపెనీలు ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని ఆకాంక్షించారు. ఇక.. హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు, ఏఐ వర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఏఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే రాజధానిగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడుతున్నామన్నారు.





## 5,586 కి.మీ రోడ్ల అభివృద్ధి

- తొలి దశలో 10,986 కోట్లతో పనులు
- హ్యామ్‌లో చేపట్టనున్న ఆర్అండ్‌బీ
- మూడేళ్లలో అద్దంలా రోడ్లు: కోమటిరెడ్డి
- ట్రాఫిక్ సర్వే ప్రకారమే హ్యామ్ రోడ్లు: భట్టి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-అక్టోబర్ 9:

ఇప్పటికే రెండుసార్లు మార్పులు చేసినా, అడుగుపడలేదు. గురువారం ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సచివాలయంలో హ్యామ్ రోడ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్వే ప్రకారం అవసరమైన చోట రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. దాని ప్రకారమే జాబితాను సిద్ధం చేశామని అధికారులు తెలపడంతో గురువారం ఆ జాబితాకు ఆమోదముద్ర పడింది. ఫలితంగా రాష్ట్రంలో ఆర్ అండ్ బీ పరిధిలో మొదటి దశలో రూ.10,986 కోట్లతో, 5,587 కి.మీ మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. వీటిలో ఒకటి, రెండు వరుసల రోడ్లు దాదాపు 3,792 కి.మీ ఉండగా.. వాటి కోసం రూ.4,416 కోట్లు, అలాగే మరో 1,795 కి.మీ మేర రోడ్లను రూ.6,569 కోట్లతో వెడల్పు చేయనున్నారు. వీటి ద్వారా మండల కేంద్రాల నుంచి జిల్లాలకు రెండు వరుసలు, జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి 4 వరుసల రోడ్లను నిర్మించనున్నారు. హ్యామ్ విధానంలో రాష్ట్రంలోని రోడ్లకు మహర్దశ పట్టనుందని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని రోడ్లను అద్దంలా తయారు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రోడ్ల నిర్మాణంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని.. మండలం, నియోజకవర్గ కేంద్రం నుంచి రాష్ట్ర రాజధాని వరకు రోడ్ల కారిడార్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి దశ హ్యామ్ పనులకు నవంబరు, డిసెంబరులో టెండర్లను ఆహ్వానిస్తామని తెలిపారు. హ్యామ్ విధానంలో చేపట్టే రోడ్ల పనులను ఆయా రహదారులపై ట్రాఫిక్ సర్వేలను దృష్టిలో పెట్టుకుని చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రోడ్ల నిర్మాణ పనులను దశల వారీగా చేపట్టి, పూర్తిచేయాలన్నారు. ఆర్ అండ్ బీలో ప్రతిపాదనల మేరకు హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రూ.10,986 కోట్ల వరకు ఖర్చవుతుందని తేలడంతో.. హ్యామ్ నిబంధనల ప్రకారం మొత్తం ఖర్చులో 40 శాతం ప్రభుత్వమే తొలుత గుత్తేదారులకు అందించాల్సి ఉంటుంది. మిగిలిన 60 శాతం నిధులను గుత్తేదారులు రుణాల రూపంలో సేకరించాలి.

## సర్కార్ నడవట్లేదు.. సర్కస్ నడుపుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ అన్నారు. అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు గులాబీ నేతలను గృహనిర్బంధం చేసారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వివేకానంద గౌడ్, శంభీర్ పూర్ రాజు, సాయిబాబా తదితరులను కూడా గృహనిర్బంధం చేశారు. ఇక మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని చలో బస్ బవన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేశారు. అంతేకాకుండా... బీఆర్ఎస్ బస్ భవన్ పిలుపు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



